బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 05 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## గ్రూప్-1 నోటిఫికేషన్‌పై తీర్పు రిజర్వ్

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్రూప్-1 నోటిఫికేషన్‌పై దాఖలైన వివిధ పిటిషన్ల విచారణను హైకోర్టు పూర్తి చేసింది. తీర్పును రిజర్వ్ చేసింది. కీ, రీ నోటిఫికేషన్, ఎస్టీ రిజర్వేషన్ ప్రకారం మెరిట్ జాబితాను మళ్లీ విడుదల చేయాలని పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. అయితే అన్ని అభ్యంతరాలను పరిశీలించాకే తుది కీని విడుదల చేశామని టీజీపీఎస్సీ కోర్టుకు తెలిపింది. ఈ నెల 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఉండడంతో ఈ కేసు విచారణకు హైకోర్టు ప్రాధాన్యత ఇచ్చింది.

563 పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. జనరల్ పోస్టులు 200, ఈడబ్ల్యూఎస్ 49, బీసీ(ఏ) 44, బీసీ (బీ)37, బీసీ(సీ) 13, బీసీ(డీ) 22, బీసీ(ఈ) 16, ఎస్సీ 93, ఎస్టీ 52, క్రీడాకారులు 4, దివ్యాంగులు 24 పోస్టులు చొప్పున ఉన్నాయి. అన్ని క్యాటగిరీలకు 1:50 నిష్పత్తి ఎంపికలో సర్వీస్ కమిషన్ విఫలమైందని, రిజర్వేషన్ క్యాటగిరీ అభ్యర్థులకు నష్టం జరుగుతున్నదని పలువురు పేర్కొన్నారు.

# మారనున్న హైదరాబాద్ రూపు రేఖలు..




- **ఫ్లై ఓవర్లు,అండర్‌పాస్‌ల నిర్మాణానికి జీఓ**
- **కేబీఆర్ పార్క్ చుట్టూ రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్**
- **రెండు ప్యాకేజీల్లో పనులు**
- **మొదటి ప్యాకేజీ రూ.421 కోట్లు**
- **రెండో ప్యాకేజీ రూ.405 కోట్లు**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరం రూపురేఖలు మారనున్నాయి. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ లు, రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. రూ.826 కోట్లతో ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కాంట్రాక్ట్ (ఈపీసీ) పద్ధతిలో ఈ పనులు చేయనుంది. కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ జంక్షన్, జూబ్లీ చెక్ పోస్ట్, రోడ్ నం.45 జంక్షన్, ఫిల్మ్ నగర్ జంక్షన్, అగ్రసేన్ మహరాజ జంక్షన్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ లో ఈ ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ ల నిర్మాణం చేపట్టనుంది. మొత్తం ఆరు జంక్షన్ల అభివృద్ధి, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ లను కనెక్ట్ చేసేలా రేడియల్ రోడ్లను నిర్మించనుంది. మొత్తం రెండు ప్యాకేజీలుగా ఈ పనులను విభజించి టెండర్లు పిలవడానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది.

మొదటి ప్యాకేజీలో రూ.421 కోట్లతో, రెండవ ప్యాకేజీలో రూ.405 కోట్లతో పనులను చేపట్టనున్నారు. అందుకోసం ప్రభుత్వం పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ శుక్రవారం జీవో జారీ చేసింది. కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లను నిర్మించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు మహానగరం సరికొత్త అందాలను సొంతం చేసుకోనుంది.

హైదరాబాద్ మహా నగరానికి నడిబొడ్డున ఉన్న కేబీఆర్ చుట్టూ నిత్యం భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీంతో వాహనాదారులు తీవ్ర పడుతుంటారు. అయితే, నగరంలోని ప్రధాన ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ పార్కు నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త ప్రణాళిక రూపొందించింది.ఇందులో భాగంగానే కాసు బ్రహ్మానంద రెడ్డి నేషనల్ పార్క్ చుట్టూ అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు, సిగ్నళ్లు, యూటర్న్‌లు లేకుండా చర్యలు చేపట్టింది. 826 కోట్ల రూపాయలతో ఆరు జంక్షన్లను అభివృద్ధి చేసేందుకు పాలనాపరమైన తెలంగాణ ప్రభుత్వం అనుమతులిచ్చింది.

తొలి దశలో 421 కోట్లతో ప్యాకేజీ-1లో జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్..కేబీఆర్ పార్క్ ఎంట్రెన్స్ దగ్గర జంక్షన్లను అభివృద్ధి చేస్తారు. యూసఫ్‌గూడ వైపు నుంచి రోడ్డు నెం.45 జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్లను నిర్మిస్తారు. కేబీఆర్ ఎంట్రెన్స్ ముగ్ధ జంక్షన్ జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వరకు 2 లేన్ల అండర్‌పాస్ నిర్మిస్తారు. పంజాగుట్ట వైపు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు మూడు లేన్ల ఫ్లైఓవర్, కేబీఆర్ ఎంట్రెన్స్ జంక్షన్ నుంచి పంజాగుట్ట వైపు మూడు లేన్ల అండర్ పాస్ ఏర్పాటు చేస్తారు.

రూ. 405కోట్లతో ప్యాకేజీ-2లో.. రోడ్ నెం.45 జంక్షన్‌ను అభివృద్ధి చేస్తారు. రెండో దశలో

మిగితా 2వ పేజీలో



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్



### 36 మంది మావోయిస్టులు మృతి


**బలగం టీవీ, నారాయణ్‌పుర్**

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోని నారాయణ్‌పుర్- దంతెవాడ సరిహద్దుల్లో శుక్రవారం భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎదురుకాల్పుల్లో 35 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ సందర్భంగా పోలీసులు భారీగా ఆటోమేటిక్ ఆయుధాలను, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

బస్తర్ రేంజ్‌లోని దంతెవాడ, నారాయణ్‌పుర్ జిల్లాల సరిహద్దుల్లో ఉండే అబూజ్‌మడ్ దండకారణ్యంలో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం అందింది. దీంతో భద్రతా సిబ్బంది ఈ ప్రాంతంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలోనే మధ్యాహ్నం సమయంలో భద్రతా దళాలను చూసిన మావోయిస్టులు వారిపై కాల్పులకు దిగారు. కేంద్ర బలగాలు, చత్తీస్ గఢ్ పోలీసులతో కూడిన సంయుక్త కార్యాచరణ బృందం ఈ కాల్పుల్లో పాల్గొంది.

ఈ ఎన్‌కౌంటర్ అనంతరం 30 మంది మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఏకే 47 రైఫిల్, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో అడపాదడపా ఎదురు కాల్పులు కొనసాగుతున్నట్లు ఐజీ తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బస్తర్ ప్రాంతంలో 170 మందికి పైగా మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

## పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్



- **కౌటిల్య ఆర్థిక సదస్సులో ప్రధాని మోడీ**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

అనిశ్చితి వేళ పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్‌గా మారిందని ప్రధాని మోడీ అన్నారు. కౌటిల్య ఆర్థిక సదస్సులో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నా భారత్ 7 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని తెలిపారు. భారత్‌లో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని పెట్టుబడిదారులు భావిస్తున్నారని చెప్పారు. ఈ అనిశ్చితి వేళ పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్‌గా మారిందని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథాన్ని కొనసాగించే దిశగా పరివర్తన మార్పులు కొనసాగుతున్నాయని చెప్పారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వ్యవస్థీకృత సంస్కరణలు అవసరం అని అభిప్రాయపడ్డారు. మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ఉద్యోగాలు, నైపుణ్యం, సుస్థిరాభివృద్ధి, వేగవంతమైన విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. భౌగోళిక అత్యవసర పరిస్థితులు నెలకొన్న వేళ ప్రపంచ మంతా భారత్ గురించి మాట్లాడుతుందంటే ఆయా దేశాలకు మన దేశం పట్ల ఉన్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. గడిచిన పదేళ్లలో చేపట్టిన సంస్కరణలే అందుకు కారణమన్నారు. ప్రపంచంలోనే భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉందని, ప్రస్తుతం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నామని తెలిపారు.

అత్యధికంగా ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు తయారయ్యే దేశం మనదేనని ప్రధాని మోడీ అన్నారు. మొబైల్ ఫోన్ల తయారీలో రెండో స్థానంలో ఉన్నామన్నారు. సంస్కరించు, పనితీరు మెరుగుపరుచు, రూపాంతరం చెందు అనేది తమ ప్రభుత్వం నిత్యం పటించే మంత్రమని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసమే మన బలమని పేర్కొన్నారు. భారత అభివృద్ధి కోసం మరిన్ని నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావడానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. గడిచిన పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడంబీ జీఎస్టీని తీసుకురావడంబీ దివాలా స్మృతిబీ గనులు, రక్షణ రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహంబీ ఎఫ్‌డీఐ నిబంధనలు సరళీకరించడం వంటివి తమ ప్రభుత్వ విజయాలుగా ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ



- **ప్రముఖ క్రీడా మైదానాలు, స్టేడియంలు అన్నింటినీ ఒకే గొడుకు కిందకు తెచ్చి స్పోర్ట్ హబ్‌గా మార్చాలి**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. నూతన క్రీడా విధానానికి సంబం ధించి అధికారులు రూపొందించిన ముసాయిదాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు. కొత్త స్పోర్ట్ పాలసీ ముసాయిదాపై ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దటంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త క్రీడా విధానం తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని కొత్త పాలసీలో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను ప్రధానంగా చర్చించి పలు సూచనలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ గా తీర్చిదిద్దాలి.

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తరహాలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీని పీపీపీ తరహాలో నిర్వహించాలి. ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించాలి. యూనివర్సిటీకి స్వయం ప్రతిపత్తి ఉండాలి. ఈ యూనివర్సిటీలో క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, షుటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, అక్వాటిక్స్ లాంటి 14 క్రీడలను స్పోర్ట్స్ హబ్‌లో చేర్చాలన్నారు.

దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించాలన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్, కోట్ల విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, ఓయూలోని వెలోడ్రోమ్ ప్రముఖ క్రీడా మైదానాలు, స్టేడియంలు అన్నింటినీ ఒకే గొడుకు కిందకు తెచ్చి స్పోర్ట్ హబ్‌గా మార్చాలని చెప్పారు. తెలంగాణ భౌగోళిక పరిస్థితులతో పాటు ఇక్కడి యువతకు ఆసక్తి ఉన్న క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి. శిక్షణకు దేశ విదేశాల్లో ఉన్న కోచ్‌లను రప్పించాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలన్నారు.

## హైదరాబాద్ చేరుకున్న డిప్యూటీ సీఎం



**బలగం టీవీ, హైదరాబాద్**

విదేశీ పర్యటన ముగించుకుని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. అమెరికా, జపాన్ దేశాల్లో 13 రోజుల పాటు అధికారులతో కలిసి పర్యటించి వచ్చిన భట్టికి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతలు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి తరలివచ్చి స్వాగతం పలికారు. అమెరికాలో జరిగిన అంతర్జాతీయ మైనింగ్ ఎగ్జిబిషన్(మైనెక్స్-2024)లో కోమత్సు, హట్యాచి, క్యాటర్ పిల్లర్ వంటి ప్రముఖ కంపెనీలు ఉత్పత్తి చేసిన అత్యాధునిక షావెల్స్, డంపర్లు, కంటిన్యూయస్ మైనర్ యంత్రాలు, గనిలో ప్రమాదాలు జరగకుండా చూసే రక్షణ వ్యవస్థలను భట్టి బృందం పరిశీలించింది.

## లడ్డూపై స్వతంత్ర సిట్

### ఐదుగురితో ఏర్పాటుకు సుప్రీం కోర్టు ఆదేశం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణలపై ఐదుగురు సభ్యులతో స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుకు అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ సిట్‌లో సిబిఐ నుంచి ఇద్దరు, ఏపి ప్రభుత్వం తరపున ఇద్దరు పోలీసు అధికారులు, ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) నుంచి ఒకరు ఉండాలని సూచించింది. అలాగే సిబిఐ డైరెక్టర్‌కు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ రద్దు అవుతుంది. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ముఖ్యమంత్రి ఆరోపణలపై దాఖలైన పిటిషన్లను శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ అంశం రాజకీయ డ్రామాగా మారకూడదని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలకు సంబంధించినదని ధర్మాసనం పేర్కొంది.

తొలుత కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ "తిరుమల లడ్డూ వ్యవహారం మొత్తాన్ని పరిశీలించాను. ఆరోపణలలో ఏదైనా నిజం ఉంటే అది ఆమోదయోగ్యం కాదు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిట్ సభ్యులపై ఎలాంటి సందేహాలు లేవు. కావాలంటే కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి ఒకరిని సిట్‌లో చేర్చవచ్చు. తిరుమల శ్రీవారికి దేశవ్యాప్తంగా భక్తులున్నారు. సీనియర్ కేంద్ర అధికారి పర్యవేక్షణ ఉంటే మరింత విశ్వాసం పెరుగుతుంది. స్వతంత్ర దర్యాప్తు ఉంటేనే.. రాజకీయ జోక్యం ఉండదు" అని తుషార్ మెహతా అన్నారు.పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ గురువారం కూడా మరొక ప్రకటన చేశారని, స్వతంత్ర దర్యాప్తు చేయాల్సిందేనని అన్నారు. "ముఖ్యమంత్రి బహిరంగ వ్యాఖ్యలు చేసిన తరువాత సిట్ వేశారు. దాని ప్రభావం సిట్‌పై ఉంటుంది. ఆయన వ్యాఖ్యలు చాలా ప్రభావం అవుతాయి. ఆయన వ్యాఖ్యలు చేయకుండా సిట్ వేస్తే, అది వేరే విషయం" అని అన్నారు.

రాష్ట్రప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ సెప్టెంబరులో ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సిఎం మాట్లాడారని, ఈ కేసుకు సంబంధించిన నివేదిక జులైలో

మిగితా 2వ పేజీలో

## ఇప్పటికిప్పుడు కూల్చివేతలు ఆపలేం

- **హైకోర్టు**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. జీవో నెంబర్ 99పై స్టే విధించాలంటూ ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ జరుగగా.. హైడ్రా కూల్చివేతలు తక్షణమే ఆపేయాలని పాల్ వాదనలు వినిపించారు. అయితే ఇప్పటికిప్పుడు కూల్చి వేతలు ఆపలేమని న్యాయస్థానం వెల్లడించింది. హైడ్రా కు చట్టబద్ధత కల్పించిన తరువాతే యాక్షన్ మొదలు పెట్టాలని పార్టీ ఇన్ పర్సన్‌గా కేఏ పాల్ వాదనలు వినిపించారు. అక్రమ కట్టడాలు కూల్చివేతలకు 30 రోజులు ముందే నోటీసులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. వాదనలు విన్న హైకోర్టు.. ప్రతివాదులుగా హైడ్రా, ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ ధాఖలు చేయాలని హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈనెల 14కు వాయిదా వేసింది. అయితే ఇప్పటికిప్పుడు కూల్చివేతలు ఆపలేమని న్యాయస్థానం వెల్లడించింది.

హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు పంపగా.. అందుకు గవర్నర్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇకపై హైడ్రాకు ప్రత్యేక చట్టం కల్పించారు. మున్సిపల్ చట్టంలో 374 - బీ సెక్షన్ చేరుస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది.

## దొడ్డు వడ్లకూ రూ. 500 బోనస్ చెల్లించాలి

- **మూసీ ప్రక్షాళన కోసం రూ. లక్షా 50 వేల కోట్లు అంటున్న సీఎంకు రైతులకు రైతు భరోసాకి, దొడ్డు వడ్ల బోనస్ కు పైసలు లేవా**
- **ఇప్పటికైనా అవినీతి ఆలోచనలు మానేసి రైతులకిచ్చిన హామీలపై దృష్టి పెట్టు.**
- **రైతు రుణమాఫీ విషయంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా ఊరుకోం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన హామీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికలకు ముందు రైతులు పండించే ప్రతి క్వింటాలు ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లిస్తామని ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిన్న జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలోనూ దొడ్డు వడ్లకు 500 రూపాయల బోనస్, ఈ వర్షా కాలానికి సంబంధించి రైతు భరోసా సాయం పైన తేల్చకుంట కప్పదాటు వైఖరి అనుసరించిన ముఖ్యమంత్రిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు. అదే విధంగా వానాకాలం సీజన్ పూర్తవుతున్నప్పటికీ ఇప్పటికీ రైతు భరోసా ఊసే ఎత్తటం లేదని ప్రశ్నించారు. వెంటనే దొడ్డు వడ్లకు బోనస్ తో పాటు రైతు భరోసా చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ బోనస్ విషయంలో ఇచ్చిన హామీని గుర్తు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చాలా స్పష్టంగా రైతులు పండించే ధాన్యం ప్రతి క్వింటాలుకు రూ. 500 అదనంగా బోనస్ ఇస్తామని ప్రకటించారని కేటీఆర్ గుర్తు చేశారు. గత సీజన్ లో రైతులకు బోనస్ ను చెల్లించకుండా వారిని ఈ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ సీజన్ లో కూడా ఇప్పటి వరకు దొడ్డు వడ్లకు బోనస్ కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి

మిగితా 2వ పేజీలో

# మారనున్న హైదరాబాద్ రూపు రేఖలు..



(మొదటి పేజీ తరువాయి)

రోడ్ నెంబర్ 45, ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు వరకు అండర్ పాస్ నిర్మిస్తారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి రోడ్ నెంబర్–45 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ ఫిలింనగర్ జంక్షన్ 1, అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్ నెం.45 జంక్షన్ వరకు 2 లైన్ల అండర్‌పాస్ అభివృద్ధి చేస్తారు. ఫిలింనగర్ జంక్షన్ నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ నిర్మాణంతోపాటు మహారాజా అగ్రసేన్ జంక్షన్ 1. క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ నుంచి ఫిలింనగర్ జంక్షన్ వరకు అండర్ పాస్ నిర్మిస్తారు. ఫిలింనగర్ జంక్షన్ నుంచి రోడ్ నెంబర్–12 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ 1. కేబీఆర్ పార్కు నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల అండర్ పాస్ అభివృద్ధి చేస్తారు. అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్డు నెంబర్–10 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇప్పటికే పరిపాలన అనుమతులు వచ్చేశాయి. ఇన పనుల వేగవంతమే తరువాయి. అండర్ పాస్ ఫ్లై ఓవర్లు ,రేడియల్ రోడ్లతో కేబీఆర్ ఏరియా రూపురేఖలు ఇక మరో లెవల్‌గా మారనున్నాయి.

# దొడ్డు వడ్లకూ రూ. 500 బోనస్ చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటన లేకపోవటంతో రైతులు అయోమయంలో ఉన్నారని కేటీఆర్ చెప్పారు.

గురువారం ధాన్యం కొనుగోలుకు సంబంధించి ముఖ్యమంత్రి సమీక్షలోనైనా ఈ అంశంపై స్పందిస్తారని ఆశించినప్పటికీ దాని గురించి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ అంటూ ముఖ్యమంత్రి మాట్లాడటం చూసి రైతులంతా ఆందోళనలో ఉన్నారని చెప్పారు. ఎన్నికలకు ముందు రైతులు పండించిన ధాన్యం మొత్తానికి క్వింటాకు రూ. 500 బోనస్ అంటూ మీ మేనిఫెస్టోలో స్పష్టంగా చెప్పటం జరిగింది. దానికి అనుగుణంగా ఈ సీజన్ రైతులు పండించిన ధాన్యం మొత్తానికి క్వింటాకు రూ. 500 బోనస్ చెల్లించాల్సిందేనని కేటీఆర్ డిమాండ్ చేశారు. గత సీజన్ బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ప్రకటిస్తామంటే అది మొత్తం రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయటమేనని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 80 శాతానికి పైగా రైతులు పండించేవి దొడ్డు వడ్లేనన్న సంగతి కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా తెలుసు అని చెప్పారు. సన్నలు, దొడ్డు వడ్లు రెండింటికి బోనస్ ఇస్తామన్న మీ మాటలు నమ్మే రైతులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారన్న విషయాన్ని మార్చిపోవద్దని కేటీఆర్ సూచించారు. ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ అంటూ సన్నాసి నొక్కులు నొక్కటమంటే అది మూమ్మటికీ రైతులను నిలువునా మోసం చేసే కుట్రనేనని అన్నారు. వెంటనే రైతులకు బోనస్ ను చెల్లించాలని లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు. లేదంటే రైతుల తరపున బీఆర్ఎస్ పోరాటం తప్పదని హెచ్చరించారు.

### రైతు భరోసా ఊసేదీ?

వానాకాలం సీజన్ పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు రైతు భరోసా సంగతి తేల్చటం లేదు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా పేరిట ఎకరాకు రూ. 7500 ఇస్తామంటూ స్వయంగా పీసీసీ అధ్యక్షుడి హెూదాలో మీరే మాట్లాడారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ గత సీజన్ లో రైతులకు రైతుబంధు పైసలు మాత్రమే వేశారు. ఈ సీజన్ కు సంబంధించి ఇప్పటి వరకు అసలు రైతు భరోసా సంగతే తేల్చటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నాట్లు వేసే నాడు వేయాల్సిన పెట్టుబడి సాయాన్ని పంట చేతికొచ్చే వరకు కూడా ఇవ్వకపోవటమంటే రైతు పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోందన్నారు. మూసీ ప్రక్షాళన కోసం రూ. లక్షా 50 వేల కోట్లు అంటూ తహతహలాడుతున్న ముఖ్యమంత్రికి రైతులకు రైతు భరోసా వేసేందుకు పైసలు లేవా అని ప్రశ్నించారు. మూసీ పేరుతో చేసే అవినీతి ఆలోచనలను మానేసి%ౌ%రైతులకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని కేటీఆర్ హితవు పలికారు. రైతును రాజును చేయాలన్న గట్టి సంకల్పంతో కేసీఆర్ గారు దేశంలో ఎక్కడ లేని విధంగా రైతుబంధు పేరిట రైతన్నలకు పెట్టుబడి సాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టారని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా తెలంగాణ వ్యవసాయం రంగంలో విప్లవాత్మక మార్పు వచ్చిందన్నారు. దేశ వ్యాప్తంగా రైతుబంధు పథకానికి ప్రశంసలు అందాయన్న విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ ఏటా రూ. 10 వేలు ముష్టి వేస్తున్నాడు మేము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 15 వేలు ఇస్తామంటూ మీరు చేసిన ప్రకటనలు విని రైతులు పెట్టుబడి సాయం పెరుగుతుందని ఆశపడ్డారన్నారు. రూ. 15 వేల సంగతేమో గానీ గతంలో ఇచ్చిన ఎకరాకు రూ. 10 వేలు కూడా దక్కని పరిస్థితి తీసుకొచ్చి రైతును గోస పెడుతున్నారు. గత సీజన్ లో కూడా రైతుబంధు విషయంలో తీవ్ర గందరగోళం సృష్టించారు. ఈ సీజన్ దాదాపు పూర్తయిపోతున్న సరే ఇప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం అందలేదన్నారు. రైతు భరోసా ఇస్తారో లేదా ప్రభుత్వం స్పష్టం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గత సీజన్ లో బాకీ ఉన్న డబ్బులను కలుపుకొని వెంటనే రైతుల ఖాతాలో ఈ సారికి మొత్తం ఎకరాకు పది వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులు కచ్చితంగా మీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు.

### 20 లక్షల మందికి రైతులకు నయా పైసా రాలే

వందశాతం రుణమాఫీ అయ్యిందంటూ విర్రవీగిన ముఖ్యమంత్రి బండారం వ్యవసాయ మంత్రి ప్రకటనతో బట్టబయలైందని కేటీఆర్ అన్నారు. 20 లక్షల మంది రైతులకు ఇంకా రుణమాపీ జరగలేదని స్వయంగా వ్యవసాయ మంత్రే ప్రకటన చేశాడంటే ముఖ్యమంత్రివన్నీ డొల్లమాటలేనని తేలిపోయింది. డిసెంబర్ 9 రోజే ఏకకాలంలో రూ. 2లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి 10 నెలలైనా 20 లక్షల మంది రైతులకు నయా పైసా రాలేదంటే రైతులను నయవంచన చేయడం కాకపోతే ఏంటీ అని కేటీఆర్ ప్రశ్నించారు. అధికారిక లెక్కల ప్రకారమే%ౌ%20 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదంటే అనధికార లెక్కల ప్రకారం ఇంకా ఎంతమంది రైతులు ఉంటారో అర్థం చేసుకోవచ్చన్నారు. రైతులకు చేయాల్సిన రుణమాఫీ పక్కన పెట్టి మూసీ పేరుతో వేలకోట్లు దోపీడి చేయాలనుకుంటున్న ఈ రాబందుల ప్రభుత్వం ఉండి రైతులకు ఏం లాభమని కేటీఆర్ నిలదీశారు. రేవంత్ చేతకానితనం.. అన్నదాతలకు కోలుకోలేని శాపంగా మారిందన్నారు. వెంటనే రైతులందరికీ రుణమాఫీ చేయకపోతే ఊరుకునేది లేదని కేటీఆర్ హెచ్చరించారు.

# లడ్డూపై స్వతంత్ర సిట్

- ఐదుగురితో ఏర్పాటుకు సుప్రీం కోర్టు ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిందని, రెండింటికి సంబంధం లేదని అన్నారు. టిటిడి తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ నెయ్యి సరఫరా చేసే ట్యాంకర్లు అసలు సరఫరాదారు నుండి కూడా సరఫరా చేయబడలేదని, తాము ఇప్పుడు సేవా పన్ను శాఖ నుండి సమాచారం పొందామని అన్నారు. టిటిడి రిట్ పిటిషన్ దాఖలు చేసిందని అన్నారు.

జస్టిస్ విశ్వనాథన్ జోక్యం చేసుకుని ఐదు పిటిషన్లు ఉన్నాయని, న్యాయస్థానం ఎప్పుడైనా అమికస్‌ను నియమించవచ్చని అన్నారు. ఆరోపణలు చాలా తీవ్రమైవని, ఎవరూ అనుమానించలేరని జస్టిస్ గవాయి అన్నారు. న్యాయవాది రోహత్గీ జోక్యం చేసుకుని పందికొవ్వు ఉపయోగించినట్లు ఖచ్చితమైన రుజువు ఉందని అన్నారు. వెంటనే కపిల్ సిబల్ జోక్యం చేసుకుని ఏ నివేదిక స్పష్టం చేస్తుందని అని ప్రశ్నించారు. అందుకు రోహత్గీ నివేదిక చూపించారు. దానికి కపిల్ సిబల్ జోక్యం చేసుకుని "ఇది కూరగాయల కొవ్వు. జంతువుల కొవ్వు కాదు. అందుకే స్వతంత్ర విచారణకు ఆదేశించాలి" అని డిమాండ్ చేశారు. ధర్మాసనం జోక్యం చేసుకుని జులై 6,7 తేదీల్లో రెండు ట్యాంకర్లు కాగా, టిటిడి ప్రస్తుత చైర్మన్ అది కాదని అన్నది రికార్డులో ఉందని పేర్కొంది. టిటిడి న్యాయవాది సిద్ధార్థ లూత్రా జోక్యం చేసుకుని కొండపై ఉన్న మందిరం పవిత్రమైనదని, ఎలాంటి అవాంఛనీయమైనదీ అక్కడికి చేరుకోలేదని అన్నారు. జూలై 4 వరకు వచ్చినవి పరీక్షించలేదని, కానీ జూలై 6, 12 తేదీల్లో చేరినవి కల్తీ అయ్యాయని అన్నారు. కపిల్ సిబల్ జోక్యం చేసుకుని కొండపైకి వెళ్లేందుకు ఎందుకు అనుమతించారని, మీరే బాధ్యత వహించాలని అన్నారు. వెంటనే లూత్రా టెండర్ మీరే (గత ప్రభుత్వం) ఇచ్చారని అన్నారు.

ధర్మాసనం జోక్యం చేసుకుని "సిబిఐ నుండి ఇద్దరు, రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇద్దరు, ఎఫ్ఎస్–ఎస్ఎఐ నుండి ఒకరుతో కూడిన స్వతంత్ర దర్యాప్తు జరుగుతుంది. సిబిఐ డైరెక్టర్ పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలి. తాము రెండు వైపుల ఆరోపణలు, ప్రత్యారోపణలలోకి వెళ్లలేదని స్పష్టం చేస్తున్నాం. కోర్టును రాజకీయ యుద్ధ భూమిగా ఉపయోగించుకోవడానికి అనుమతించం. కోట్లాది మంది ప్రజల మనోభావాలను నివృత్తి చేయడానికి స్వతంత్ర సిట్ దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేస్తున్నాం. దేవునిపై విశ్వాసం ఉన్న కోట్లాది ప్రజల మనోభావాలను తీర్చేందుకు మాత్రమే కమిటీని ఏర్పాటు చేశాం" అని పేర్కొంది.



# సీఎంకు రైతులంటే పట్టింపు లేదు

బలగం టీవి, హైదరాబాద్

పది నెలల ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదు.. ఆయన మొనగాడు కాదు మోసగాడు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రైతు ధర్నాలో హరీశ్ రావు పాల్గొని ప్రసంగించారు.

"రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైంది. కొమరెల్లి మల్లన్న, యాదాద్రి, భద్రాద్రి, సమ్మక్క – సారలమ్మ మీద ఒట్టు పెట్టి మొనగాడు లెక్క మాట్లాడిండు. కానీ ఇప్పుడు ఆయన మోసగాడు అని తేలిపోయింది. రైతు బంధు, రుణమాఫీ, పింఛన్లు, మహాలక్ష్మి అన్ని చేస్తా అన్నాడు. ఇప్పుడు సప్పుడు లేదు. మొత్తం రుణమాఫీ అయ్యింది రాజీనామా చేయ్ హరీష్ రావు అని సవాల్ విసిరిండు. మరి రుణమాఫీ అయితే ఇంత మంది రైతులు ధర్నాకు ఎందుకు వచ్చారు..? పాలకుర్తి మండలంలోనే 4314 మందికి రుణమాఫీ కాలేదు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. రాష్ట్రంలో 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ అయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పారు. మిగతా వారికి కాలేదు అన్నడు. చెప్పిన 22 లక్షల మందిలో కూడా కొందరికి పూర్తిగా రుణమాఫీ కాలేదు. రకరకాల కారణాలతో రుణమాఫీ ఆపే ప్రయత్నం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. 31 సాకులు పెట్టి రుణమాఫీ ఎగబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. రేవంత్ మోసగాడు అని రైతులు, ప్రజలు అంటున్నారు" అని హరీశ్‌రావు తెలిపారు.

### రాష్ట్రంలో బాలికలు, మహిళలకు భద్రత కరువైంది

రాష్ట్రంలో బాలికలు, మహిళలకు భద్రత కరువైందని, భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఇటీవల ఇద్దరు బాలికలపై జరిగిన లైంగికదాడి తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. మహిళలకు భద్రత లేదని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని హెచ్చరించినా నిర్లక్ష్యం వీడలేదని, అందుకే నిత్యం రాష్ట్రంలో ఎకడో ఒకచోట లైంగికదాడి ఘటనలు జరుగుతూనేఉన్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో 2000కు పైగా లైంగికదాడి ఘటనలు జరిగాయంటే పరిస్థితి ఏ విధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. హెూంశాఖను కూడా తానే నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షణలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని, షీ టీమ్స్, సఖీ, భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి రక్షణ కల్పించిందని గుర్తుచేశారు. ఇందిరమ్మ రాజ్యమని ఊదరగొట్టడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యంలో మహిళా భద్రత లేదని తేటతెల్లమైందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి శాంతిభద్రతల పర్యవేక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. బాలికలపై లైంగికదాడిన పాల్పడిన దుర్మార్గులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని డిమాండ్ చేశారు.

# మందుల కొరత రాకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

- ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం..
- ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యధిక ప్రసవాలు జరిగేలా కార్యాచరణ
- వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్



**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల జిల్లా పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందేలా పటిష్ట కార్యాచరణను అమలు చేయాలని ఆరోగ్యశాఖ సంచాలకులు ఆర్వీ కర్ణన్ అన్నారు. శుక్రవారం ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, అదనపు కలెక్టర్లతో కలిసి సిరిసిల్ల వైద్య ఆరోగ్య శాఖ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో జరుగుతున్న ప్రసవాల సంఖ్య, సీజనల్ వ్యాధులు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్య కళాశాల, తెలంగాణ డయాగ్నస్టిక్ సేవలు , ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల లభ్యత తదితర వివరాలను సంచాలకులు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యధికంగా ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అత్యవసరమైన పక్షంలోనే సి సెక్షన్ ఆపరేషన్లు నిర్వహించాలని అన్నారు. సి సెక్షన్ ఆపరేషన్లను నియంత్రించడంలో గతంతో పోలిస్తే ఇప్పుడు సిరిసిల్ల జిల్లా మంచి పురోగతి సాధించిందని, ఇదే విధానంతో ముందుకు పోవాలని అన్నారు. అధికంగా సి సెక్షన్ ఆపరేషన్లు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసి ఆడిట్ నిర్వహించాలని సంచాలకులు అధికారులను ఆదేశించారు

జిల్లాలో నూతన ఆసుపత్రుల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మాత్రమే జరగాలని అన్నారు. పిసిఎన్బీ యాక్ట్ అమలు జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వహించాలని, నూతన స్కానింగ్ సెంటర్లు, పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు కమిషనర్ అనుమతి తప్పనిసరని అన్నారు.

జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పనితీరు నిరంతరం పర్యవేక్షించాలని, ఆడపిల్లలు భ్రూణ హత్యలు జర్గకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పి.సి.ఎన్.బి యాక్ట్ అమ్మలకు సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా అడ్వైజర్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద మందుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి వ్యాధికి సంబంధించి అవసరమైన మందులు పూర్తి స్థాయిలో ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని , జిల్లాలకు కేటాయించే డ్రగ్స్ అవసరమైన ఆసుపత్రుల వద్ద అందుబాటులో ఉండేలాగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అందుబాటులో ఉన్న డ్రగ్స్ వివరాలపై వైద్యులు అవగాహన కలిగి ఉండాలని, అందుబాటులో ఉన్న డ్రగ్స్ ను మాత్రమే రోగులకు ప్రిస్క్రైబ్ చేయాలని, రోగులు అనవసరంగా బయట ప్రైవేటుగా మందులు కొనాల్సిన అవసరం రావద్దని,డ్రగ్స్ స్టాక్ వివరాలు కట్టుదిట్టంగా నిర్వహించాలని సంచాలకులు అధికారులను ఆదేశించారు.

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్స్ సేవల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి శాంపిల్స్ సేకరించి డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. రేడియాల జీ విభాగానికి సంబంధించి కూడా పరీక్షల నివేదికలు ఎప్పటికప్పుడు అందజేయాలని , ప్రతి ల్యాబ్ టెక్నీషియన్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలు సమర్ధవంతంగా అందించేలా చూడాలని అన్నారు.

సిరిసిల్ల జిల్లాలోని వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మంజూరైన స్టాఫ్, ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్టాఫ్ , ఖాళీలు మొదల వివరాలను తెలుసుకున్నారు. వైద్య కళాశాల, అనుబంధ ఆసుపత్రి నిర్మాణ పనులు 2 సంవత్సరాల కాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సిరిసిల్ల జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకున్న చర్యలను సంచాలకులు పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్ లను నిశ్చితంగా పరిశీలించి వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని,సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టడం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన సంచాలకులు, అప్రమత్తత కొనసాగించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంత రావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, మెడికల్ సూపరింటెండెంట్లు లక్ష్మీనారాయణ, పెంచలయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ సంతోష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డీటెయిల్స్ సర్వే వివరాలు పకడ్బందీగా సేకరించాలి



- సిరిసిల్ల ఐదో వార్డులో ఫ్యామిలీ డిజిటల్ సర్వే పరిశీలన
- ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ప్రత్యేక అధికారి, వైద్య కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్.

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ఫ్యామిలీ డీటెయిల్స్ సర్వే వివరాలు పకడ్బందీగా సేకరించాలని జిల్లా ప్రత్యేక అధికారి, వైద్య కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఐదో వార్డులో కొనసాగుతున్న ఫ్యామిలీ డిజిటల్ సర్వేను జిల్లా ప్రత్యేక అధికారి, వైద్య కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేలో భాగంగా అధికారులు, సిబ్బంది సేకరిస్తున్న వివరాలు, పత్రాలు పరిశీలించి, పలువురు స్థానికులతో మాట్లాడారు. అధికారులు, సిబ్బంది ప్రతి కుటుంబం వివరాలు తీసుకోవాలని, జనన, మరణ వివరాలు అప్డేట్ చేయాలని సూచించారు. ఫోటోలు తీసుకోవాలని ఆదేశించారు.

**వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి..**

ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి, వైద్య కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రధాన దవఖానను వైద్య కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ శుక్రవారం పరిశీలించేందుకు రాగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పుష్పగుచ్చం అందించి, స్వాగతం పలికారు. అనంతరం ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ ను పరిశీలించి, రోజూ ఎంత మంది వస్తున్నారో ఆరా తీశారు. వివరాలు ఆన్లైన్ లో నమోదు చేస్తుండగా పరిశీలించారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, ప్రసూతి విభాగం, బ్లడ్ బ్యాంక్, మేల్ వార్డ్, ఫిమేల్ వార్డ్, డయాలసిస్ వార్డ్ లను పరిశీలించి, రోజు ఎంత మందికి సేవలు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

## ఒకేసారి మూడు ప్రభుత్వ కొలువులను సాధించిన యువకుడు

- మామను ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ కోలువులను కొట్టిన అల్లుడు


**బలగం టీవీ , తంగళ్లపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన కోల వినయ్ కుమార్ ఒకే సారి మూడు ప్రభుత్వ కొలువులను సాధించాడు.తన మామ అయిన పసుల స్వామి పౌర సరఫరాల అధికారిగా విధులు నిర్వర్థిస్తున్నాడు అతన్ని ఆదర్శంగా తీసుకొని ఈ కొలువులను సాధించానని కోలా వినయ్ కుమార్ తెలిపారు. తన మామని ఆదర్శంగా తీసుకొని ప్రిపరేషన్లో ఉంటూ స్కూల్ అసిస్టెంట్ సోషల్ లో జిల్లా ర్యాంక్ 10 ,ఎస్జీటీ జిల్లా ర్యాంక్ 38 , వసతి గృహ సంక్షేమ అధికారి జోనల్ ర్యాంక్ 58 రావడం జరిగిందన్నారు. ఈ కొలువులు తన తండ్రి, మామ స్వామి ల నిరంతర ప్రేరణతో సొంత నోట్స్,కోచింగ్ లేకుండా పక్క ప్రణాళికతో, రోజు వారి మాక్ టెస్ట్ రాయడం వల్ల సాధ్యం అయిందని అన్నారు. తదుపరి గ్రూప్ 1 కూడా సాధించి సమాజానికి మరింత సేవ చేయాలని ఆశిస్తున్నానని తెలిపాడు.మూడు ఉద్యోగాలు సాదించినందుకు గ్రామస్తులు అభినందించారు.

## రాష్ట్రంలో భారీగా జడ్జీల బదిలీలు

**బలగం టీవీ , హైదరాబాద్**



రాష్ట్రవ్యాప్తంగా 70 మంది జూనియర్, సీనియర్ సివిల్ జడ్జీలను హైకోర్టు బదిలీ చేసింది. వివిధ జిల్లాల్లో జూనియర్ సివిల్ జడ్జీలుగా పనిచేస్తున్న 38 మందికి సీనియర్ సివిల్ జడ్జీలుగా పదోన్నతి కల్పిస్తూ కొత్త జిల్లాల్లో పోస్టింగ్ ఇస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. మరో 32 మంది సీనియర్ సివిల్ జడ్జీలను పాత స్థానాల నుంచి కొత్త జిల్లాలకు బదిలీ చేశారు. వీరంతా ఈ నెల 18వ తేదీకల్లా ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతాల నుంచి రిలీవ్ కావాలని, వారి బాధ్యతలను తదుపరి ర్యాంక్లో ఉన్న జ్యుడిషియల్ ఆఫీసర్లకు అప్పజెప్పాలని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీకల్లా కొత్త ప్రాంతాల్లో బాధ్యతలను చేపట్టాలన్నారు. పాత స్థానాల్లో రిలీవ్ కావడానికి ముందే రిజర్వులో ఉంచిన తీర్పులను వెలువరించాలని పేర్కొన్నారు.

# ఓటమితో మొదలు



బలగం టీవీ, దుబాయ్

2024 మహిళల టీ20 ప్రపంచకప్‌ను భారత జట్టు ఓటమితో ప్రారంభించింది. శుక్రవారం న్యూజిలాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. ప్రత్యర్థి జట్టు నిర్దేశించిన 161 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో బ్యాటర్లు విఫలం కావడంతో 102 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ 15, జెమీమా 13, దీప్తి 13, స్మృతి 12, రిచా 12 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే ఔటయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో రోస్‌మేరీ 4, లియా 3, ఇడెన్ 2, అమేలియా ఒక వికెట్ తీశారు.

160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. ఓపెనర్ షఫాలీ వర్మ(2)ను ఈడెన్ కార్సన్ ఔట్ చేసింది. 11 పరుగులకే తొలి వికెట్ పడిన దశలో మరో ఓపెనర్ స్మృతి మంధాన(12), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(15)లు ఆచితూచి ఆడారు. కానీ.. మంధాన వికెట్ సాధించిన కార్సన్ మరోసారి భారత్‌ను దెబ్బకొట్టింది. రన్‌రేటు పెరుగుతుండడంతో భారీ షాట్లకు దిగిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఎల్బీగా వెనుదిరిగింది. తర్వాత స్వల్ప వ్యవధిలోనే జెమీమా రోడ్రిగ్స్(13, రీచా ఘోష్(12), అరుంధతి రెడ్డి(1)లు కూడా ఔట్ కావడంతో భారత్ ఓటమి దాదాపు ఖాయమైంది. ఆఖరి వికెట్‌గా రేణుకా సింగ్ వెనుదిరగడంతో కివీస్ 58 పరుగుల తేడాతో గెలుపొందింది.

మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ భారీ స్కోర్ కొట్టింది. కెప్టెన్ సోఫీ డెవినె(57 నాటౌట్) సుడిగాలి ఇన్నింగ్స్ ఆడింది. మొదట ఓపెనర్లు సుజీ బేట్స్(27), జార్జియా ప్లిమ్మర్(34)లు శుభారంభం ఇవ్వగా.. మిడిల్, డెత్ ఓవర్లలో సోఫీ రెచ్చిపోయింది. టీమిండియా ఫీల్డింగ్ వైఫల్యాన్ని సొమ్ము చేసుకున్న డెవినె బలమైన షాట్లతో విరుచుకు పడింది. బ్రూక్ హల్లిడే(16)లతో నాలుగో వికెట్‌కు 46 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పింది. దాంతో, న్యూజిలాండ్ నిర్ణీత ఓవర్లలో 160 పరుగులు

# వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా గెలుపు



బలగం టీవీ, దుబాయ్

మహిళల టీ20 వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. శుక్రవారం దుబాయ్ క్రికెట్ స్టేడియంలో సౌతాఫ్రికా వర్సెస్ వెస్టిండీస్ మధ్య తొలి మ్యాచ్ జరగగా.. ముందు బౌలింగ్ చేసిన సౌతాఫ్రికా టీం.. కరీబియన్లను వణికించారు. ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ సఫారీలు సత్తాచాటారు. ఓపెనర్లు లారా వొల్వార్ట్ (59 నాటౌట్), తంజిమ్ బ్రిట్స్ (57 నాటౌట్) అర్ధ శతకాలతో మెరిసారు. మెగా టోర్నీలో అద్భుత రికార్డు కలిగిన విండీస్ బౌలర్లను ఉతికేస్తూ అజేయంగా జట్టును విజయ తీరాలకు చేర్చారు. ఈ ఇద్దరి విధ్వంసంతో సఫారీలు ప్రపంచకప్ ఆరంభంలోనే అదిరే బోణీ కొట్టారు.

నిర్ణీత 20 ఓవర్లలో వెస్టిండీస్ విధించిన 119 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సఫారీ జట్టు సులువుగా ఛేదించింది. పవర్ ప్లేలో ఓపెనర్ తంజిమ్ బ్రిట్స్(57 నాటౌట్), కెప్టెన్ లారా వొల్వార్ట్ (59 నాటౌట్)లు మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. బౌండరీలతో చెలరేగి వెస్టిండీస్ బౌలర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారు. ఏకంగా 10 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టారు.

టాస్ ఓడిన బ్యాటింగ్‌కు వెస్టిండీస్ జట్టుకు ఆదిలోనే షాక్ తగిలింది. కేవలం 15 పరుగులకే ఆల్ రౌండర్ మరిజానే కాప్ (2/14) ధాటికి ఓపెనర్ హేలీ మాథ్యూస్(10) పరుగులకే పెవిలియన్ చేరారు. ఆ తర్వాత బౌలింగ్ చేసిన లెకో లబా(4/29) మరో ఓపెనర్ క్వియానా జోసెఫ్ (4) ను వికెట్ తీసి విండీస్‌ను ఒత్తిడిలో పడేసింది. అనంతరం స్టఫానీ టేలర్(44), విధ్వంసక ఆల్‌రౌండర్ డియాంద్ర డాటిన్ (13)లు ధనాధన్ ఆడి జట్టును ఆదుకున్నారు. కానీ, మరిజానే మరోసారి జట్టుకు బ్రేక్ నిస్తూ డాటిన్‌ను ఔట్ చేసింది. దీంతో 62 పరుగులకే విండీస్ సగం వికెట్లు కోల్పోయి పీకల్లోతూ కష్టాల్లో పడింది. ఆ దశలో టేలర్, జైదా (15 నాటౌట్)లు వరుస బౌండరీలు బాది జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ అందించారు.



## నేటి నుంచి భారత్ - బంగ్లా

# హైదరాబాద్ టీ20 టిక్కెట్ల విక్రయం

బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా ఈ నెల 12న భారత్–బంగ్లాదేశ్ మధ్య మూడో టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ మ్యాచ్ దసరా పండుగ రోజున (అక్టోబర్ 12) జరగనుండగా ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయంపై హెచ్‌సీఏ ఒక ప్రకటన విడుదల చేసింది. అక్టోబర్ 5(నేటి) నుంచి ఈ మ్యాచ్ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విక్రయిస్తామని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పేటీఎం యాప్‌లో టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. అయితే ఈసారి మాత్రం ఆఫ్‌లైన్‌లో టిక్కెట్లు అమ్మడం లేదని ఆయన స్పష్టం చేశారు.టిక్కెట్ల ధర రూ.750 నుంచి రూ.15 వేల వరకు ఉందన్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న వారు ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జింఖానా గ్రౌండ్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఫిజికల్ టిక్కెట్లు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ ప్రింటవుట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఐడీ కార్డు చూపించి టిక్కెట్లు పొందవచ్చని తెలిపారు.



# మ్యాచ్‌కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

బలగం టీవీ, హైదరాబాద్

ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో త్వరలో జరగనున్న టీ- 20 క్రికెట్ మ్యాచ్‌కు అన్ని రకాల సెక్యూరిటీ పరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. శుక్రవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. ఉప్పల్ స్టేడియంలో డీసీపీలు, ఏసీపీలు, జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపక, విద్యుత్ శాఖతోపాటు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప అవకాశమని, ఎన్ని సవాళ్లు ఎదురైనా తగిన విధంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ప్రేక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు. టికెట్ల పంపిణీలో ఎటువంటి గందరగోళం లేకుండా చూడాలని నిర్వహణ బృందానికి సూచించారు. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అవసరమైన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. స్టేడియం పరిసరాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు.నకిలీ టికెట్లు అమ్మేవారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని, టికెట్ల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, ఎటువంటి పుకార్లనూ నమ్మవద్దని తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు పద్మజ, రమణారెడ్డి, ఉషా విశ్వనాథ్, కరుణాకర్, అరవింద్ బాబు, అడిషనల్ డీసీపీ శ్యామ్, హెచ్‌సీఏ అధ్యక్షులు జగన్మోహన్రావుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటివాడైన రషీద్ ఖాన్

బలగం టీవీ, హైదరాబాద్



ఆఫ్గానిస్థాన్ స్టార్ ఆల్‌రౌండర్ రషీద్ ఖాన్ పెళ్లి చేసుకున్నాడు. గురువారం వైభవంగా జరిగిన రషీద్ ఖాన్ పెళ్లి వేడుకకు తన సహచర క్రికెటర్లతో సహ ప్రముఖులు హాజరయ్యారు. ఇక పెళ్లి చేసుకున్న రషీద్ ఖాన్‌కు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. క్రికెటర్లతో పాటు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు.